# టెలిగ్రాం

“ఒరేయి నీకో టెలిగ్రాం వచ్చిందిరా వెంకాయి” అన్నాడు పెద బొండాయి. “బహుశా నీ పింతండ్రెవడో డబ్బున్నోడున్నాడంటివిగా, ఆడు చస్తే ఆడాస్తి నీ కొచ్చిందేమో సూడు!” అన్నాడు.

“నిజంగా నాకే నంటూరా?” అని అడిగాను.

“నీకే గామోసురా! ఇప్పరా, ఇప్పరా. ఇప్పకుంటా అందులో యేం ఉందో ఎట్టా సెపుతావ్ ! ఇప్పు” అన్నాడు శంకర్.

“కాదురా కాదురా! నాకు తెలుసురా! నే మొన్నొత్తుంటే బ్రాకెట్లంట- అదోరకం ఆట. అందులో రూపాయేత్తే ఎనభై రూపాయి లొత్తాయంట ! రెండు రూపాయిలేశాను. వచ్చిందేమో. వత్తే నూట అరవై రావాలి. ఇవ్వు ఇప్పుతా” అన్నాను నేను.

“చూత్తావేం! ఇప్పూ !” అన్నాడు పెదబొండాయి.

“గమ్మత్తేరా! మొన్నొకడికిట్లాగే పదహారొందలొచ్చింది బొంబాయి నుంచి. యేందికట్టం ? ఊరికే యీడు రెండు రూపాయి లేశాడా ? ఏత్తే, నూట అరవై రూపాయి లొత్తునై ? ఇంకేం ! నైజాంకన్న గొప్పోడే !” అన్నాడు శంకర్.

అయితే నాకొచ్చిన పట్టరాని సంతోసంతో కనబోయే గర్బినీ అల్లే వొణుకుతున్నా. “ఇదిగో పెదబొండాయి నువ్విప్పి సెప్పరా. నే కళ్ళు మూసుకుంటా, నువ్వు సెప్పంగానే సంతోసంతో కళ్ళిప్పుతా !” అని అడిగిచ్చాను నా టెలిగ్రాం.

పెదబొండాయి నా టెలిగ్రాం ఇప్పాడు. నే కళ్ళుమూసుకున్నా. ఆడు

లోలోపల సదువుకున్నాడు, ఈల యేత్తూ కూకున్నాడు."చాలా వత్తున్నదిరా నీకు. బలే, చాలా వత్తున్నదిరా!" అన్నాడు.

"ఎంతరా ఎంతరా?" అంటూ ఓ కన్ను తెరిశాను.

"నిజమేనా? ఎంతరా?" అని అడిగాడు శంకర్.

శంకరామాటంటూ పెదబొండాయి సేతులో టెలిగ్రాం లాక్కొని తాను గూడా సదువుకున్నాడు. యెంటనే బొంగ్రాలు తిరుగుతూ నవ్వడం మొదలెట్టాడు. ఆ నవ్వుతో గుభీలున యెక్కడ సత్తాడో అనిపించింది.

శంకర్ నవ్వుతూ పక్కమీద కూలపడ్డాడు. "హాహా" అని నవ్వాడు. "ఒక ప్రయిజుకాదురా—రెండు ప్రయిజు లొచ్చాయిరా!" అంటూ నేలమీద దొర్లుకుంటూ నవ్వడం సాగించాడు. కాసేపయిం తర్వాత "సూడూ యెంకాయి ! ఆమాటెందు కీమాటెందుకు గానీ ఈ టెలిగ్రాం నీ బార్య నుంచి వచ్చిందిరా సదువుకో!" అంటూ ఆ కాగితం నా మొగానేశాడు.

"ఆ! అంటే మొదటి ప్రయిజూలేదు, రెండో ప్రయిజూలేదంటావా? ఈ నవ్వంతా యీ యదవ యాలాకోలం అంతా వృదాయేనా? యదవల్లారా యదవల్లారా" అని అంటూ ఆ కాగితం సదువుకున్నా.

సదువుకోంగానే సందమామ పట్టడాని కెగిరినట్టుగా ఒక్క యెగు రెగిరా!

"ఉహూంహూ" అన్నాను.

"ఉహూంహూ!" అంటూ గదిసుట్టూ తిరిగాను. నాయెనకాలే ఆళ్లిద్దరూ తిరిగారు. నా బుజం తడుతూ నన్నూపారు.

ఆ టెలిగ్రాం నాబార్య లచ్చి రాయించింది. అందులో యేం ఉందంటే "కవలపిల్లలు కలగబోతుండారు. తచ్చనం రావాల్సింది!" అని.

"ఒకటిగాదు రెండు బిడ్డలురా!" అన్నాడు బొండాయి.

"ఒక్కరాయికి రెండు పిట్టలంటరా?" అన్నాడు శంకర్.

"బార్సాలకు మేంగూడా రావాల్రా" అన్నాడు బొండాయి.

"ఉండరా ఉండరా! బిడ్డ లొత్తారంట, ఇంకా రాలా! వచ్చినప్పుడు సూద్దాం బార్సాల. ఈలోపు నాకో వారం సెలవిత్తాడేమో మేజరుసాబు" అన్నాను.

"ఆ, నిజమే. నువ్వు కంపెనీ ఆపీసెళ్ళు, మేంఇద్దరం నీ కిట్టు బ్యాగ్ సద్దుతాం" అన్నాడు పెదబొండాయి.

కంపెనీ ఆపీసెళ్ళాను. అవుల్దారు మేజరు నన్ను మార్చిసేసుకుంటూ మేజరు యదట పెట్టాడు. బూట్లు తక్కన కొట్టాను. సెల్యూట్ తక్కన పెట్టాను. టెంసన్లో నిలబడ్డా.

మేజరు రమ్ము తాగుతున్నాడు. కళ్ళెర్రగా ఉన్నాయి.

"ఏమిటోయి వంకాయలూ?" అని అడిగాడు. నన్ను వంకాయల వెంకాయంటారు లెండి! ఆ సంగతి తర్వాత సెపుతా.

నా టెలిగ్రాం బల్లమీద పెట్టాను. వారంరోజులు సెలవడిగాను.

"ఓ ఓ!" అన్నాడు మేజరు. "సంతోషమోయి. ఓరి పిడుగా! అస హాయ శూరుడివల్లే ఉన్నావే. ఒక్కదెబ్బకు రెండుపళ్ళు రాలినయ్యా, బలే బలే" అంటూ కాగితంమీదేందో లెక్కలేశాడు. కాసేపటికి తలెత్తి "ఒరేయి వంకాయలూ! శాస్త్రప్రకారం లెక్కేశాను. ఒక్కబిడ్డకు వారంరోజులు శెల వడిగితే రెండు బిడ్డలొస్తున్నారన్నావుగా? రెండేళ్ళు పధ్నాలుగు రోజులు కావాలి. సరే ఇచ్చాను పో" అన్నాడు.

బొమ్మడు మేజరైతే మిలిటరీలో గూడా చాత్రంవత్తుంది. ఆడి నెత్తి కాయి చాత్రం! యేసుకున్నాడు బాగా రమ్ము! నాకేం వారం అంటే రెండు వారా లొచ్చాయి.

రై లెక్కాను. ఉండండర్రా, ఉండండర్రా అన్నాను ప్లాటుఫారంమీద పరుగెత్తుతున్న శంకరూ పెదబొంతాయినీ సూసి. యెనక్కు సేరగిలి కూకున్నా.

అయితేనేంలే. యనక సెలవిచ్చి సంవత్సరమయింది. ఇప్పుడు మళ్ళీ ఇయ్యడం న్యాయమే.

సంవత్సరం అనుకునేప్పటికి గుండె ఆగిపోయింది. కాళ్ళు వణికాయి. పెదిమలు ఆడాయి. నాలిక నలికెళ్ళపాముల్లే లోపలికీ బయటికీ పోతున్నది.

నిజానికి సంవత్సరం కిందగందా నే నింటికెళ్ళింది? కవల లొత్తుండా రని నిన్న గందా లచ్చి టెలిగ్రాం ఇచ్చింది? ఈ కదుపుకు కారణం ?

రైలు దిగాను. నేరుగా ఇంటికెళ్ళాను. మా యిల్లు సుందరయ్యగారి షేదపక్కన. ఓ చిన్న వసారా. తలుపు తటాలున తీశాను. కుక్కిమంచం మీద ఒంటరిగానే పడుకునుంది లచ్చి. చేతులో యేందో ఫోటో చూత్తోంది.

"ఎప్పుడొచ్చా, ఎప్పుడొచ్చా" అంటూ కావలించుకోబోయింది.

"ఖదేరావు" అన్నాను.

"యాందీ ?" అన్నది.

"ఏందీ యవారం అంతా ?" అన్నాను.

"నా టెలిగ్రాం మాటా నువ్వడిగేది ?" అని నవ్వింది.

"అవును! ఏం సెపుతావు ? అనవసరంగా సెలవు తీసుకొచ్చాను పైగా!" అన్నాను.

"కవలల్లేరు గివలల్లేరు. ఊరికేనే ఇచ్చా టెలిగ్రాం. మరి నేనట్టా టెలిగ్రాం ఇత్తేనేగందా నీకు సెలవిచ్చారూ ?" అన్నది.

నిజమే! దాని సేతులో పోటో సూశాను. డ్రెస్సులో ఉండగా తీయించుకున్న నాదే అది. ముద్దెట్టుకున్నా.

●